# విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 102 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శనివారం 25 ఏప్రిల్ 2026 • పేజీలు : 8 • వెల 2/-


## ఎపిలో ఠారెత్తిస్తున్న ఎండలు

- భానుడి భగభగలతో జనం బెంబేలు
- మరింతం ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న ప్రఖర్ జైన్



**విజయవాడ,ఏప్రిల్24 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడు భగభగలాడుతున్నాడు. ఏపీవ్యాప్తంగా ఎండల తీవ్రత రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోతతో జనం అల్లాడిపోతుండగా, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తాజాగా మరో హెచ్చరిక జారీ చేశారు. రాబోయే 24 గంటల్లో

మిగతా 2వ పేజీలో..

## పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

- మొదటిదశలో 110కి పైగా సీట్లు గెలుస్తాం
- కేంద్రహోంమంత్రి అమిత్ షా ధీమా



**కోల్‌కతా,ఏప్రిల్24 (చట్టం న్యూస్) :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన కోల్‌కతాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం

మిగతా 2వ పేజీలో..

## 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసు

### కెసిఆర్, కెటిఆర్,హరీష్ రావులపై కేసు కొట్టివేత



**హైదరాబాద్,ఏప్రిల్24 (చట్టం న్యూస్) :** హైదరాబాద్‌లో 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసుకు సంబంధించి తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అప్పటి టీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో వారికి న్యాయపరంగా పెద్ద ఊరట లభించింది. 2011 మార్చిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మిలీనియం మార్చ్ పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఈ నిరసన కార్యక్రమం సమయంలో కొన్ని మీడియా వాహనాలు, కెమెరాలు, ఓబీ వ్యాన్లు ధ్వంసం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు సమయంలో ఆ

మిగతా 2వ పేజీలో..

## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

- బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది
- ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ

**కోల్‌కతా,ఏప్రిల్24(చట్టం న్యూస్) :** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక

మిగతా 2వ పేజీలో..



## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం



**హైదరాబాద్,ఏప్రిల్24 (చట్టం న్యూస్) :** ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని

మిగతా 2వ పేజీలో..

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

- కిల్లర్ పార్టీ నేతలు కొత్త ఎత్తుగడలు
- వారి వ్యూహాలకు తగ్గట్లుగా ఉండాల్సిందే
- ఎంతటి దారుణాలకైనా తెగించేస్తున్నారు
- క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ అధినేత చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్ 24 (చట్టం న్యూస్) :** వైసిపి రాజకీయ కుట్రలతో అప్రమత్తంగా ఉండాలని టిడిపి శ్రేణులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కిల్లర్ పార్టీతో టీడీపీ నేతలు అందరూ జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో కిల్లర్ పార్టీ దారుణాలకు తెగబడుతోందని.. వారి ఆగడాలు చెల్లనివ్వమని హెచ్చరించారు. జగన్ అండ్ కో రోడ్ల మీదకు వస్తారని, రెచ్చగొడతారని, రప్పా రప్పా అంటారని, ప్రజలను ఇబ్బందులు పెడతారని, చర్యలు తీసుకుంటే రాజకీయ కక్ష అంటారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించి.. వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల వంటి అంశాలపై సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతామని... కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సమకాలీన రాజకీయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశర చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ప్రస్తావించారు. తన జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప... నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని.. ఇది తనకు కొత్తగా ఉందని తెలిపారు. వైసీపీ సోషల్ సైకోలతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ లాంటి పార్టీని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశారని.. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని కూడా బెదిరించారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు కేడర్ వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అవకాశాలను

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణం

- రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించాం
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి

**నెల్లూరు,ఏప్రిల్24(చట్టం న్యూస్) :** రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం కృష్ణపట్నంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ప్రాచీన దేవాలయ పునరుద్ధరణకు మంత్రి శంకుస్థాపన చేశారు. నిపుణుల బృందంతో కలిసి ఆలయాన్ని మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాబోయే రెండేళ్లలో రూ.750 కోట్లు కేటాయించి భజన మందిరాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న 43 ఆలయాలకు కూటమి ప్రభుత్వం రూ.52 కోట్లు వెచ్చించిందని మంత్రి వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణం

మిగతా 2వ పేజీలో..



## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

### బిజెపిలో చేరుతున్న రాఘవచద్దా తదితరులు

**న్యూఢిల్లీ,ఏప్రిల్24 (చట్టం న్యూస్) :** ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు. ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరపున రాజ్యసభలో సభ్యులుగా

మిగతా 2వ పేజీలో..

## నూతన దిశగా పంచాయితీరాజ్ వ్యవస్థ

### ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్

**అమరావతి,ఏప్రిల్24 ( చట్టం న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ నూతన దిశగా ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం స్పందించారు. గ్రామ స్వరాజ్యం దిశగా ఏపీ వేగంగా అడుగులు వేస్తోందని.. స్వయం ప్రతిపత్తితో ముందుకు సాగుతోందన్నారు. గ్రామ సభలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ సమన్వయంతో గ్రామ సభలు, పల్లె పండుగ 1.0 / 2.0 విజయవంతం అయ్యాయని అన్నారు. స్వచ్ఛ రథాలు, ఎస్‌ఎల్‌ఆర్‌ఎమ్(÷ూఒఖీఓ) కార్యక్రమాలు, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ గ్రామ స్వరాజ్యం యాత్రలో భాగస్వాములైన ప్రజలకు, సర్పంచ్‌లకు, వార్డ్ సభ్యులకు, పంచాయతీరాజ్ అధికార యంత్రాంగానికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## అమరావతిపై అక్కసు వెళ్లగక్కేవారితో ఏం పని

- జగన్ పార్టీని పట్టించుకోవాల్సిన పనిలేదు
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి విమర్శలు

**అమరావతి,ఏప్రిల్24 ( చట్టం న్యూస్ ):** అమ్మ, అమరావతి, ఆంధ్రప్రదేశ్ అంటే ఇష్టం లేని వారిని ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సమాధానం చెప్పాల్సిన అవసరమూ ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ రెడ్డిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రాజకీయం చేయాలనుకుంటే.. ముందు ఇంటిని చక్కబెట్టుకోవాలని హితవుపలికారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ నేతలకు అసూయ ఎక్కువై, కడుపుమంటతో మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రను

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో మరో కొత్త పార్టీ

- నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత
- కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
- తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం



**హైదరాబాద్,ఏప్రిల్24 ( చట్టం న్యూస్ ):** తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసు కుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించ బోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును

మిగతా 2వ పేజీలో..

# తెలంగాణలో మరో కొత్త పార్టీ

**మొదటి పేజీ తరువాయి..**

ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి



శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

**మొదటి పేజీ తరువాయి..**

నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమీ

**మొదటి పేజీ తరువాయి..**

ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలు నిరంతరం గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఉద్ఘాటించారు. 2019లో వైసీపీ గెలిచాక ఏపీలో అభివృద్ధి జరగలేదని ప్రస్తావించారు. తనను అరెస్టు చేసినా, పార్టీని ఇబ్బంది పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాలను దాటి సామాన్య ప్రజలను కూడా జగన్ హయాంలో ఇబ్బందులకు గురి చేశారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలని అన్నారు. మనం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంతోపాటు.. కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పడే కష్టలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తలే అధినేతలని.. పార్టీ కూడా కార్యకర్తలను అలాగే గౌరవిస్తోందని స్పష్టం చేశారు. అన్యాయం జరిగిందని జగన్ రెడ్డి పరామర్శకు వెళ్తారని... కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపేస్తారని... కానీ తన కారు కింద పడిపోయిన కార్యకర్తను మాత్రం ఎందుకు పరామర్శించరని ప్రశ్నించారు. కడపలో సొంత పార్టీ కార్యకర్తనే హత్య చేశారని ఆరోపించారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ప్రభుత్వ భూములను దోపిడీ చేశారని ఆగ్రహించారు. పంపకాల్లో విభేదాలు రావడంతో దస్తగిరి అనే వైసీపీ కార్యకర్తను చంపేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. వాళ్ల అనుచరులను వాళ్లే చంపుకుని నేరం తమపై నెట్టేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలయ్యేదాకా మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యను వాడుకున్నారని... అధికారంలోకి వచ్చాక న్యాయం చేయాలని జగన్ చెల్లెలు వైఎస్ సునీతారెడ్డి అడిగితే సైలెంట్‌గా



ఉండమని ఆమెను కూడా బెదిరించారని ఆగ్రహించారు. ఆస్తి విషయంలో తల్లి, చెల్లిపై ఎవరైనా కోర్టుకు వెళ్తారా..? అని మండిపడ్డారు.

## రాష్ట్రంలో 706 పురాతన ఆలయాల పునర్నిర్మాణం

**మొదటి పేజీ తరువాయి..**

అపూర్వమైన ఘట్టమని అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం హిందూ జనోద్ధరణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆలయాల విశిష్ఠతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో దీపారాధనకు కూడా ఆలయాలు నోచుకోక పోవడం బాధాకరమన్నారు. 10, 11 శతాబ్దాల కిందట గండగోపాలపురంగా పిలువబడ్డ ఈ ప్రాంతంలో సిద్ధేశ్వర ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. ఆలయాల పునర్నిర్మాణం త్వరితగతిన జరగాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆలయాల పునర్నిర్మాణం కోసం శ్రమిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులను కూటమి ప్రభుత్వం అభినందిస్తోందని మంత్రి తెలిపారు. బ్యాంకుల్లో ఉన్న ఆలయాల ఫిక్సిడ్ డిపాజిట్లను ఎట్టి పరిస్థితుల్లో ఖర్చు చేయవద్దని.. ఫిక్సిడ్ డిపాజిట్ల నుంచి వచ్చే ఆదాయాలను మాత్రమే వినియోగించవచ్చని ఆనం సూచించారు. ఆలయ కమిటీలు, బోర్డు మెంబర్ల నియామకంలో గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. చట్టాలను గౌరవించే నాయకుడు సీఎం చంద్రబాబు అని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శతాబ్దాల కాలంనాటి సిద్ధేశ్వర ఆలయం పునర్నిర్మాణం జరగడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆలయాన్ని కూల్చకుండా పునర్నిర్మాణం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయాన్ని ప్రాచీన పద్ధతుల్లోనే పునర్నిర్మాణం చేస్తున్నారని వివరించారు. ఆలయానికి కావల్సిన నిధులు సిద్ధంగా ఉన్నాయని... దాతలు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

## వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యం

### వార్డు సభ్యులు సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్

**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 24 ,(చట్టం బ్యూరో) :** తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తామని వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బోయిన్ పల్లి మండలం వరద వెల్లి గ్రామం లో ప్రారంభించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యులకు ఇన్సూరెన్స్ లు గౌరవ వేతనం కల్పించాలని కోరారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర మంత్రులను ప్రతిపక్ష నాయకులను ఎమ్మెల్యేలను కలసి వార్డు సభ్యుల సమస్యల పట్ల వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్టుపై క్లీన్ చీట్ తీర్పుపై సంబరాలు



**రాయికల్ ఏప్రిల్ 24 చట్టం :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై గౌరవ హైకోర్టు వెలువరించిన సానుకూల తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం రాయికల్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద బి.ఆర్.యస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణి చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపశిల్పి, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలతో అభిషేకం చేసి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ తీర్పు తెలంగాణ ప్రజల విజయమని, ప్రాజెక్టుపై జరిగిన అసత్య ప్రచారాలకు హైకోర్టు తీర్పుతో చెక్ పడిందని పేర్కొన్నారు. కేసీఆర్ దూరదృష్టి వల్లనే కోట్లాది ఎకరాలకు సాగునీరు అందుతోందని వారు కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో మండల ఐ పట్టణ పార్టీ అధ్యక్షులు బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగ సౌజన్య -శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్ రావు, మహేష్ గౌడ్ , మాజీ ఏఎంసీ ఛైర్మన్ మారంపెల్లి రాణి, నాయకులు మహేశ్వర్ రావు, మ్యాకల రమేష్, రాజేశ్వర్ రావు, కొయ్యడి మహిపాల్, సత్యనారాయణ, బత్తిని భూమయ్య, లింగం గౌడ్, ఎద్దండి దివాకర్, హరీష్ రావు, కోల రాజు, సంతోష్ రావు, ఎనుగంటి రవి, రుక్కు, బత్తిని నాగరాజు, మణికంఠ, పొట్టవతిని శ్రీధర్, బొమ్మకంటి నవీన్, కొక్కుల రంజిత్, మహేందర్, శేఖర్, అన్సర్, నవీన్ మరియు మండల, పట్టణ స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

**మొదటి పేజీ తరువాయి..**

కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్దాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నీ కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## అమరావతిపై అక్కసు వెళ్లగక్కేవారితో ఏం పని

**మొదటి పేజీ తరువాయి..**

అభివృద్ధి చేసింది.. చేసేది తామే అని మంత్రి స్పష్టం చేశారు. ఒక్క అవకాశం ఇస్తే ఉత్తరాంధ్రను, విశాఖను కబ్జా చేసి, ఎవరూ బతకలేకుండా ఆస్తులు లాక్కున్నారని ఆరోపించారు. విశాఖ వాసుల మంచితనాన్ని దౌర్జన్యంగా దోచుకున్నారని అన్నారు. రుషికొండను బోడికొండను చేయటంతో పాటు స్టీల్ ఎ÷-లాంట్‌ను మూసివేయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారాలు, వ్యవహారాలను సర్వనాశనం చేసిన వారు ఇప్పుడు ఉత్తరాంధ్ర మంచి చెడుల గురించి మాట్లాడటానికి సిగ్గుపడాలన్నారు.

కూటమి అధికారంలోకి వచ్చాక స్టీల్ ఎ÷-లాంట్‌ను తిరిగి ఓపెన్ చేయించామని మంత్రి సంధ్యారాణి అన్నారు. సీఎం చంద్రబాబు, లోకేశ్ కృషితో ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థ ఏపీకి వచ్చిందన్నారు. అర్సెల్లార్ మిట్టల్‌తో పాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉత్తరాంధ్రకు క్యూ కడుతున్నాయని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల పండుగను కూటమి ప్రభుత్వం ఉందనే ధైర్యంతో సగర్వంగా జరుపు కుంటోందన్నారు. వైసీపీ హయాంలో పార్టీ మీటింగ్‌లు పెడతారని వీసీలు కూడా భయపడిపోయారని సంధ్యారాణి పేర్కొన్నారు.

## కేరళను ఠారెత్తిస్తున్న ఎండలు

- గతంలో ఎప్పలూ లేనంతగా ఉష్ణోగ్రతలు
- స్వీయ నిర్బంధంతో ఇంట్లోనే ఉండాన్న సిఎం

**తిరువనంతపురం,ఏప్రిల్24:** కేరళలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఆ రాష్ట్రంలో అధిక తేమతో కూడిన తీవ్రమైన వేడి కనీసం ఏప్రిల్ 27 వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నీతా కె. గోపాల్ వెల్లడించారు. వడదెబ్బకు ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఒకరిద్దరు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కోవిడ్-19 తరహాలో ఇప్పుడు సెల్ఫ్ లాక్ డౌన్ అంటే స్వీయ నిర్బంధం పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండ తగిలే సమయాల్లో నేరుగా సూర్యరశ్మికి గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య అనవసర ప్రయాణాలు, బహిరంగ ప్రదేశాలలో పనులు మానుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. అలాగే ఈ సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, క్రీడా కార్యక్రమాలు నిషేధించ నున్నట్లు వెల్లడించారు. వడగాలుల హెచ్చరికల దృష్ట్యా, పాలక్కాడ్, కొల్లాం, త్రిస్సూర్ జిల్లాల్లో పండుగల సమయంలో పగటిపూట జరిగే ఏనుగుల ఊరేగింపులు, బాణాసంచా ప్రదర్శనలను నివారించాలని లేదా వాయిదా వేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ప్రయాణికులకు, ప్రజలకు తాగునీటిని అందించడానికి నీటి ట్యాంకులను, నీడ ఉన్న విశ్రాంతి ప్రదేశాలను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలు, కుటుంబశ్రీ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలసట లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండదెబ్బకు ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి వైద్య సహాయం అందించాలని విజయన్ కోరారు..

## పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

**మొదటి పేజీ తరువాయి..**

తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మొదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. మరోవైపు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

## 2011లో జరిగిన మిలీనియం మార్చ్ కేసు

**మొదటి పేజీ తరువాయి..**

ఉద్యమంలో పాల్గొన్న నేతలపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది. అయితే, వీరు ప్రత్యక్షంగా ఘటనల్లో పాల్గొన్నారని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని వారి తరపు న్యాయవాదులు వాదించారు. పిటిషనర్లకు ఈ ఘటనలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు ఆందోళనకు నాయకత్వం వహించినా, ఆస్తి నష్టం జరిగిన ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత లేదని న్యాయస్థానానికి తెలిపారు. దీర్ఘకాల విచారణ అనంతరం, ఆయా ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజా తీర్పులో, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నమోదైన కేసులను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో వారికి ఎలాంటి క్రిమినల్ బాధ్యత లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో వారికి చట్టపరంగా పెద్ద ఊరట లభించింది.

## హుగ్లీ నదిలో ప్రధాని విహారం



**మొదటి పేజీ తరువాయి..**

ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఈ రోజు ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హావ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

## ఎపిలో ఠారెత్తిస్తున్న ఎండలు

**మొదటి పేజీ తరువాయి..**

ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో గాలిలో వేడి పెరిగి తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేశాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలో 43.7 డిగ్రీల నమోదైందని చెప్పారు. రాష్ట్రంలోని సుమారు 207 మండలాల్లో ఉష్ణోగ్రతలు 41కంటే ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని, లోతట్టు జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ ఏడాది ఉష్టోగ్రతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే హెచ్చరికలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రఖర్ జైన్ ఈ జాగ్రత్తలు పాటించాలని కోరారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం ఉత్తమమని తెలిపారు. దాహం వేయకపోయినా తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాని సూచించారు.లేత రంగు గల నూలు దుస్తులు ధరించాలని అన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు కట్టుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

# సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం..

- ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి
- వేములవాడలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్, భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి
- డీజీపీ బీ శివధర్ రెడ్డి
- రుద్రంగిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి డీజీపీ, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 24 ,(చట్టం బ్యూరో) :** రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డీజీపీ బీ శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో ఎకరం స్థలంలో ఆధునిక హంగులతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ బీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా డీజీపీ బీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. మావోయిజం అంతమైందని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసింగ్ లో నూతన మార్పులు తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజల కేంద్రగానే సేవలు అందించేలా పోలీసులకు శిక్షణ ఇస్తామని, అదే స్థాయిలో విస్తృత సేవలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ కోసం.. తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రంలో ఎక్కువ మరణాలు జరగడంలేదని, రోడ్డు ప్రమాదాల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చిన తర్వాత తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. పౌరులు బాగుంటే రాష్ట్రం.. దేశ అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు.
వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో వేములవాడలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నానని తెలిపారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అండగా ఉంటున్నారని చెప్పారు.



**ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకం**

ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు ఎంతో కీలకమైనవి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. అన్ని సెలవుల్లో వారు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమాలు పాటించేలా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోమ్ శాఖ నిర్వహిస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు దాడులు చేస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ఇటీవల ప్రారంభించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కింద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. తాను కోరిన వెంటనే రుద్రంగికి సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ స్టేషన్ మంజూరు చేశారని వెల్లడించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, మూలవాగు పై మూడో బ్రిడ్జి పనులు చేయిస్తున్నామని, రుద్రంగికి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు అయిందని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వేములవాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, అలాగే భీమారంలో పోలీస్ స్టేషన్ ఇవ్వాలని, వేములవాడలో ఆలయ భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని డీజీపీని కోరారు. రుద్రంగి, భీమారంలో రెవెన్యూ, మండల పరిషత్ భవనాలు ఇస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామి కావడం అదృష్టమని పేర్కొన్నారు.



**నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకం**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత.. మెరుగైన సేవలు అందించేందుకు నూతన పోలీస్ స్టేషన్ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, అధికార యంత్రాంగంతో కలిసి ఇటీవల జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, మహా శివరాత్రి జాతర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరిలో జాతీయ భద్రతా మాసోత్సవాలు నిర్వహించామని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణలో భాగంగా జిల్లాలో ఇటీవల అరైవ్.. అలైవ్ కింద జిల్లాలో నో హెల్మెట్.. నో ఎంట్రీ అమలు చేస్తున్నామని, ఇప్పటికే అన్ని గ్రామాల సేఫ్టీ కమిటీలకు తెలిపామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**నేరాల నియంత్రణ కోసం..**

జిల్లాలోని రుద్రంగి మండలం చిన్నదని, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. మండల ప్రజల సహకారంతో మండల కేంద్రంలో నేరాల నియంత్రణ కోసం ఇటీవల హై క్వాలిటీ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఇూచీూ=) సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పోలీస్ స్టేషన్ ద్వారా మండల ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే కాకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుందన్నారు. అరైవ్.. అలైవ్ కింద జిల్లాలోని ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆటో మున్సిపల్ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించామని, సీపీఆర్, ప్రాథమిక ఆరోగ్య చికిత్స పై అవగాహన కల్పించామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాభాయ్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ లు, ఎస్ఐలు, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ప్రభుత్వం కాదు రాక్షస ప్రభుత్వం.

- సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..



**పెగడపెల్లి, ఏప్రిల్ 24( చట్టం న్యూస్ ):** గిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రం లో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం,మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.2023లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి రైతు ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి అనేక హామీలు ఇచ్చిందని వాటి అమలులో ప్రభుత్వం వైఫల్యం చెందడం వల్లనే రైతులకు భయపడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు జరపకుండా పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో ఎన్నుకోవడానికి మంత్రిమండలి తీసుకున్న నిర్ణయము హేయమైన చర్య అని సహకార సంఘాలను నిర్వీర్యం చేయడానికి ఇలాంటి నిర్ణయం తీసుకుందని మర్రిపెల్లి సత్యమ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతు ఓటర్లను ఆకర్షించడానికి ఎకరానికి సంవత్సరానికి 15,000 రైతు భరోసా ఇస్తామని రెండున్నర సంవత్సరాల కాలంలో ఎకరానికి 12,000 చొప్పున ఒక్కసారి మాత్రమే రైతు భరోసా ఇచ్చారని గత నెల రోజుల కాలంలో ఎకరానికి 6000 చొప్పున రెండు విడతలుగా రెండు ఎకరాలకు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుని కౌలు రైతులను గాలికి వదిలేశారని అన్నారు. వరికి క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని తరువాత సన్నవడ్లకు మాత్రమేనని సన్నాయి నొక్కులు నొక్కుతూ బోగస్ మాటలతో రైతులను మోసం చేశారని అన్నారు. ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చేయలేదని ప్రభుత్వ పెద్దలు మాత్రం రెండు లక్షల రుణమాఫీ చేశామని కానీ అవి రైతుల ఖాతాలో పడ్డాయో లేదో మాకు తెలియదు అంటూ స్వయంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. గత సంవత్సరం ఖరీఫ్ రబి సీజన్లలో రైతులు యూరియా కోసం చెప్పరాని తిప్పలు పడ్డారని పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయక అకాల వర్షాలకు నష్టపోతే ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని అతివృష్టి వల్ల పంట నష్టపోయిన రైతులకు నయాపైసా నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఏ ఒక్క రైతుకు కూడా రైతు బీమా ఇవ్వలేదని అందుకే ప్రత్యక్ష ఎన్నికలు జరిగితే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించాలనుకుంటుందని అందుకే ఇది రైతు ప్రభుత్వం కాదని రాక్షస ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు.ఈసమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య నాయకులు కదారి జనార్దన్,తడగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

## హామీలు ఇచ్చారు..ఆచరణ మరిచారు



**కొడిమ్యాల, ఏప్రిల్ 24(చట్టం) :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న తాత్కాలిక ఉద్యోగులతో పాటు శాశ్వత ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారంకై పలు విధాలుగా నిరసనలు తెలుపుతున్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యోగులు కోరుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం వారి నిరసనలను ఎలా విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. అంతే గానీ వారి సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం లేదు. వీటిలో ఒక సమగ్ర శిక్ష విభాగం ఉద్యోగుల గూర్చి చూస్తే..గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష తాత్కాలిక ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారంకై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 రోజులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 28 రోజుల పాటు నిరవధిక సమ్మె చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు 5 సెలవులు పెంచి చేతులు దులుపుకుంది. మిగతా ఏ విధమైన ఆర్థిక, ఆర్థికేతర అంశాలను నేటికీ పరిష్కరించక పోవడంతో కుటుంబ పోషణకు సరిపోని గౌరవ వేతనంతో గత 15 ఏండ్లుగా ఆ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

## మజ్జిగా, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**కొడిమ్యాల, ఏప్రిల్ 24(చట్టం) :** మండలంలోని గంగారాం తండాలో సర్పంచ్ వినోద్ నాయక్ శు క్రవారం ఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్, మజ్జిగా ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ ఎండ తీవ్రత దృశ్యా ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రకాష్, గ్రామ కార్యదర్శి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకుల పంపిణీ



**రాయికల్ ఏప్రిల్ 24 చట్టం :** రాయికల్ పట్టణంలోని అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాయికల్ మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్ పుట్టినరోజు వేడుక సందర్భంగా పట్టణంలోని నిరుపేద కుటుంబమైన బొల్లపెల్లి ప్రసాద్ కు శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ నిర్వాహకులు మహేష్ మాట్లాడుతూ నిరుపేదలు, చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు ఎక్కడ ఉన్నా కుల, మత, ప్రాంతీయ విభేదం లేకుండా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐదవ వార్డ్ కౌన్సిలర్ కూనారపు భూమేష్, మాజీ కౌన్సిలర్ వల్లకొండ మహేష్ గౌడ్, మోర శైలజ చంద్ర తదితరులున్నారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 24 ,(చట్టం బ్యూరో) :** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శు క్రవారం ఐపీఎస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు.
తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## మంత్యానాయక్ తండాలో అక్షరాభ్యాసం



**రాయికల్ ఏప్రిల్ 24 చట్టం :** రాయికల్ మండలం మంత్యానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా అన్నప్రసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. తిరుపతి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒడ్డెలింగాపూర్ సర్పంచ్ మానస నాయకులు సాయిరాజ్,ఉప సర్పంచ్ సూర్యానాయక్, పంచాయతీ కార్యదర్శులు టీ.రాకేశ్, జి.సాయి, అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి, సిబ్బంది రమాదేవి, జల, ఆశ వర్కర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం ;

- కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వం
- విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి
- ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్




**రాజన్న సిరిసిల్ల జిల్లా / ఏప్రిల్ 24 ,(చట్టం బ్యూరో) :** రాజన్న సిరిసిల్ల జిల్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని తక్షణమే ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కనీసం విద్యాశాఖకు మంత్రిని నియమించలేని పరిస్థితిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లు ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల విద్యార్థిని విద్యార్థులు సెమిస్టర్ ఎగ్జామ్ లు అయిపోయినా కూడా వారికి టీసీలు మెమోలు ఇవ్వకుండా పూర్తి ఫీజు చెల్లిస్తేనే ఇస్తామని చెప్పి కళాశాలలో భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని విద్యాశాఖ అధికారులు తెలంగాణ విద్యాశాఖ ఏం చేస్తున్నట్లు అని దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యల పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తక్షణమే రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను అడ్డుకోవాలని కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీ అరికట్టాలని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు మెట్టు రాకేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు సార్ల సతీష్, ఆడెపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చట్టం
శనివారం। 25-4-2026

## ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?

ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్తు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. ముందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతున్నారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలను మరచి ఎవ్వరి కష్టుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేనప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరవు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కడు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు అప్పులకు దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్లీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే విని వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వాన్నంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుకు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

## శంకర్ గౌడ్ మృతి విషాదకరం

**ఈ బలిదానం తీవ్రంగా కలచివేసింది**

**మాజీమంత్రి హరీష్ రావు ఆవేదన**

హైదరాబాద్,ఏప్రిల్24 : ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచివేసిందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి పోస్ట్ చేశారు. శంకర్ గౌడ్ మృతికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. 'ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసింది. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు మా ఘన నివాళులు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వల్లనే ఈ దుస్థితి. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు కూడా అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు? ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం. జోహార్ శంకర్ గౌడ్' అంటూ హరీశ్ రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## బాలికపై లైంటికదాడి కేసు

**భీమవరం డిఎస్పీపై హైకోర్టు ఆగ్రహం**

**అమరావతి,ఏప్రిల్24 :** భీమవరం డీఎస్పీపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భీమవరానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని న్యాయస్థానాన్ని బాలిక తల్లి ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ కేసును ఉపసంహరించుకోవాలని బాధితురాలిని పోలీసులు బెదిరించడం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. బాలికకు అండగా ఉండాల్సిన పోలీసులే ఇలా చేస్తే ఎలా? అని న్యాయస్థానం మందలించింది. 'ఫిర్యాదు వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని చెప్పడానికి సిగ్గుగా అనిపించడం లేదా' అని డీఎస్పీని హైకోర్టు ప్రశ్నించింది. రాజకీయ కారణాలు ఉన్నాయని మీరు ఎలా చెబుతారు. దేవుడు మీకేమైనా దివ్య దృష్టి ఇచ్చాడా? అని నిలదీసింది. రాజకీయ కారణాలా లేక ఇతర కారణాలా అనేది సంబంధిత కోర్టు తేలుస్తుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేకుంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డీఎస్పీపై కోర్టు మండిపడింది. డీఎస్పీ వివరణ సంతృప్తికరంగా లేదని కేసు రికార్డులతో తమ ముందు హాజరు కావాలని జిల్లా ఎస్పీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## నర్వంపేట వెళ్లకుండా బిఆర్ఎస్ నేతల అడ్డగింత

**మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ తదితరుల అరెస్ట్**

**జనగామ,ఏప్రిల్24 :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొనడానికి వరంగల్ జిల్లా నర్సంపేట వెళ్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ ఘనాపూరం మార్గ మధ్యలో అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితను జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌కు కార్యకర్తలతో చేరుకొని, స్టేషన్ ఎదురుగా బైఠాయించారు. బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, వారి మరణానికి కారణమైందని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి వారి అపాయింట్మెంట్ డేటును ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆకర్షణ లేని ట్రంప్ గోల్డ్ కార్డు పథకం

**నాలుగు నెలల్లో ఒక్కటి మాత్రమే జారీ**

**అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హాళవార్డ్ లుట్నిక్**



**వాషింగ్టన్,ఏప్రిల్24 :** అమెరికాలో శాశ్వత నివాసం కోరుకునే విదేశీయుల కోసం గతేడాది డిసెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం గోల్డ్ కార్డు స్కీమ్‌ను ప్రారంభించింది. కొత్త స్కీమ్ అమల్లోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకూ కేవలం ఒక్కరికే గోల్డ్ కార్డు దక్కింది. ఈ విషయాన్ని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హాళవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్ (చట్టసభలు) కమిటీకి ఈ వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గోల్డ్ కార్డు కావాలనుకునే విదేశీయులు 1 మిలియన్ డాలర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు అదనం. అయితే, ఈ స్కీమ్‌కు డిమాండ్ అద్భుతంగా ఉందని మొదట్లో లుట్నిక్ చెప్పుకొచ్చారు. ఏకంగా 1.3 బిలియన్ డాలర్ల విలువైన వాటిని జారీ చేశామని అప్పట్లో అన్నారు. ఇందుకు భిన్నంగా ఆయన కేవలం ఒక్క గోల్డ్ కార్డును మాత్రమే జారీ చేశామని తాజాగా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, వందల సంఖ్యలో గోల్డ్ కార్డు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని లుట్నిక్ కాంగ్రెస్ కమిటీకి చెప్పారు. వీసా కోసం జనాలు క్యూకట్టారని కూడా లుట్నిక్ అన్నారు. అధికారులు ఈ మధ్యనే పూర్తి స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని కూడా చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంపికైన వారికి కేవలం ఐదేళ్లల్లోనే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది.

# అత్యాచారం, హత్యాచారం కేసు

**రాహుల్ మీనాకు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్24 :** రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో అత్యాచారం, హత్యాచారం కేసుల్లో అరెస్టు చేసిన నిందితుడు రాహుల్ మీనాకు నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీ విధించింది న్యాయస్థానం. ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేసిన కేసుల్లో అతన్ని పోలీసులు గురువారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. ఆ సమయంలో పోలీసులకు చుక్కలు చూపించాడు నిందితుడు రాహుల్. విచారణ సమయంలో నిందితుడు తన స్టేట్మెంట్‌ను పలుమార్లు మార్చి చెప్పినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. అనంతరం నాలుగు రోజుల కస్టడీ కోరుతూ ఢిల్లీ పోలీసులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ సందర్భంగా 'నా వల్ల నేరం జరిగింది.. తప్పు జరిగిపోయింది' అంటూ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దీపికా థాకరన్ ఎదుట రాహుల్ మీనా నేరం ఒప్పుకున్నాడు. విచారణ అనంతరం నిందితుడిని నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. రాజస్థాన్‌లోని అల్వార్‌లో మంగళవారం రాత్రి తన స్నేహితుడి భార్యపై నిందితుడు రాహుల్ మీనా అత్యాచారం చేశాడు. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ వ్యాన్‌ను రూ.6 వేల కిరాయికి మాట్లాడుకుని ఢిల్లీకి బయలుదేరాడు. అక్కడికి చేరిన తర్వాత నగదు చెల్లించకుండానే పారిపోయాడు. గతంలో కైలాష్ హిల్స్ ప్రాంతంలో తాను పని చేసిన ఇంటి వద్దకు చేరుకున్నాడు. యజమాని, అతని భార్య జిమ్‌కి వెళ్లడంతో ఉదయం 6:30 గంటలకు ఇంట్లోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న యజమాని కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మొబైల్ ఛార్జర్ వైర్‌తో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం విలువైన వస్తువులు దోచుకుని పరారయ్యాడు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గతంలో అక్కడ పని చేసిన సమయంలో నగదు విషయంలో అవకతవకలకు పాల్పడడంతో అతన్ని పని నుంచి తీసేశారు యజమాని. దాన్ని మనసులో పెట్టుకుని ఈ దారుణానికి ఒడికట్టాడు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరిపై అత్యాచారం చేసి అందులో ఒకరిని హత్య చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కస్టడీలో నిందితుడు ఇంకా ఎలాంటి విషయాలు వెల్లడిస్తాడో వేచి చూడాల్సిందే.

------------------

# ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత

**శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు**

**పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు**

**డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న**

వరంగల్,ఏప్రిల్24 : వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోనకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యత్నించారు. దీంతో పోలీసులను వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తుండగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సహా బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు తీసుకెళ్లకుంటే శంకర్ గౌడ్ ఆత్మ శాంతించదని అన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకి శంకర్‌గౌడ్ మృతదేహాన్ని తరలించేదాకా కదిలేది లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శంకర్‌గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళితే అభ్యంతరం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అనవసరంగా అడ్డుకుని ఎందుకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ డిపోకు తరలించాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళి అర్పిస్తే నష్టమేంటన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కి వరంగల్ పోలీస్ కమిషనర్ ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. అయితే శంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్న కేంద్ర మంత్రి సూచించారు. 22 ఏళ్లపాటు నర్సంపేట ఆర్టీసీ డిపోలో శంకర్‌గౌడ్ సేవలందించారని, అక్కడికి తీసుకెళితేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## ఆర్టీసీ కార్మాకులకు రేవంత్ తీరని ద్రోహం

**రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,ఏప్రిల్24 :** వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పు÷-టటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

**భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక**

**టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ**

**ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు**



కోల్‌కతా,ఏప్రిల్24 : పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

## హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

**ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు**

**హైదరాబాద్,ఏప్రిల్24 :** రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియిమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు



## అన్నం పరబ్రహ్మ స్వరూపం

అన్నపూర్ణకు నిలయమైన భారతావనిలో
ఆకలితో అలమటించే అన్నార్తుల సంఖ్య
అధికమవుతు ఉన్న విషయం విని
అరవై ఏళ్ల అనుభవంతో
ఆర్ద్రతతో వ్రాస్తున్నా
ఆర్భాటంగా వివాహ,పుట్టినరోజు వంటి వేడుకలలో
అంతస్తుకు తగ్గట్టు ఉండాలంటు
అరవై రకాల పదార్థాలను
అరటాకుల నిండా వడ్డిస్తు
ఆరు ప్రాంతాలలో కొన్ని చోట్ల అదిరే కాంతులీను టెంటుల కింద యూనిఫార్మ్ డ్రెస్ లలో ఉన్న వారు
అందరికి బఫే అంటు వడ్డిస్తు నిలబడి
ఆహారం సగం తిని ,ఎవరో చెప్పగా అది వదలి
అక్కడి కెళ్ళి వేరొక పదార్థం తిని
అది పూర్తిగా తినక వదిలేస్తు
అరడజను డ్రింక్ లు
ఐస్క్రీములు పెట్టి,
నోరు ఎర్రబడటానికి రెండు మూడు పాన్ లు
ఎన్నని, ఏమని చెప్పను
అన్నం పర బ్రహ్మ స్వరూపమని తెలిసికూడా
ఆహారాన్ని దుర్వినియోగంచేయడం ఎంతవరకు సమంజసం?

విజ్ఞులమని చెబుతున్న మనమంతా
ఒక్కసారి ఆలోచించ వలసిన విషయం
ఆకలితో అలమటించే అన్నార్తుల వ్యథను తీర్చడానికి ఆడంబరాలకు పోక ఆహారాన్ని వృథాచేయక
"అన్నం పరబ్రహ్మ స్వరూపం"అన్నదానికి ప్రతీకగా నిలుద్దాం..!!

( నేడు జరిగే అనేక కార్యక్రమాలలో ఆహారం దుర్వినియోగం అవడం చూసి ఆర్ద్రత తో వ్రాసినది)

ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి)
విశాఖపట్నం



## కలిలో వేంకటేశుడే దైవం



క్షేమము గోరి యీ క్షితిని గాతువు మా
క్షామముదీర దర్శన భాగ్యార్థమిత్తువు

సకలార్థ సాధనకై చనుదెంచు వారొకరు
వికలమైన మనసుతో వినుతించే దింకొకరు
ఒకే ఒక్కకోర్కెతో ఉరికివచ్చే దొక్కరు
నీకొరకే నేవచ్చితి నీదరిశన మీయుమయ్య

వేలాదిగ తరలివచ్చె విజ్ఞులు పుణ్యాత్ములు
నీలీల నిచ్ఛగించ నిలువుదోపి డిచ్చువాళ్ళు
కాలము పురికొల్ప నిన్గనగ వచ్చెజ్ఞానులు
ఆలించి పాలించు మర్భకుడ నీసుతుండ

కామముతో లోకము వర్ధిల్లగ కాపాడుదువు
నీమముతో నిను నందరిలో జూపింతు వ
క్రమము కాని కామము నేనే యందువు స
క్రమమర్థించిన వారలకు సకల మందించుదువు

కలియుగ వైకుంఠమని వరగిరుల కల్పకమని
ఇలాతలము వేల్పుమయం ఇక్కట్టు లూడ్చని
తలాతల రసాతలాద్యధోలోక మచ్యుతువని
ఏలికల కేలికవని ఇహపరాల కిభ్యుడవని

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956



## వృద్ధాప్యం శాపమా ! వరమా.....?

వృద్ధాప్యం
జీవితంలో చివరి అంకం
వృద్ధుల అనుభవాలు జ్ఞాపకాలు ఈనాటి యువతరానికి రేపటి తరానికి మార్గదర్శనం
కంప్యూటర్ ఇంటర్నెట్ సెల్ ఫోన్
యూట్యూబ్ డిజిటలైజేషన్ కృత్రిమ మేధ (ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్)
సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి పేరిట
వృద్ధులకు చిన్న చూపు
వారి మాటలు చేష్టలు చీదరింపు
ప్రపంచం కుగ్రామం
చిన్న చితకా రోగం
మోకాళ్ళ నొప్పులు ఊబకాయం మానసిక ఒత్తిడికి
మందుల అవసరం
హాస్పిటల్ పోకుండా
ఇంట్లోనే ఉంటే
ప్రయోజనం శూన్యం
గతాన్ని మరచి
నవమాసాలు మోసి
పెంచి పెద్ద చేశాక
వృద్ధులను చీదరింపు చిత్కారింపు
ఏమి తెలియదని ఎగతాళి
వృద్ధాశ్రమాల్లో చేర్పించి రాక్షసానందం
రేపటి గురించి లేని
ఆలోచన అభిప్రాయం
మనం ఎంత అభివృద్ధి చెందాం
ఏమి సాధించాం
అనేది కాదు ప్రశ్న
కన్నవారిని ఎంత బాగ చేసుకుంటున్నాం
అనేదే ప్రశ్న
వృద్ధాప్యం శాపం కాదు వరం
ఉన్నప్పుడు పట్టించుకోకుండా
తర్వాత వారిని జ్ఞాపకం చేయడం వృధా
వృద్ధాప్యం దేవుడి వరం
కోరుకుంటే అందని ఫలం

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
అధ్యక్షులు,
హైదరాబాద్ ఓల్డ్ సిటీ రైటర్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (హౌకా) సైదాబాద్,
హైదరాబాద్

## పొంచి ఉన్న ప్రమాదాలు...!



నిదానంగా గమ్యంలో సాగుతుంటే
వేగంగా వచ్చెను వాహనం
హఠాత్తుగా జరిగేను ప్రమాదం
నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం.


ఇంటిలో కూర్చుంటే
ఉరుకుతూ వచ్చేను కుక్క
పట్టి పీకేను పిక్క
ఆపద ఖరీదు జీవితం

పనిపై కార్యాలయమునకు వెళితే
మెల్లగా అడిగెను లంచం
ఇవ్వాల్సిందే అంటూ పంతం
అవినీతి ఖరీదు కృంగిపోయే సమాజం

జనులకు ఉచిత పతకాల మోజు
అవి లేకుంటే అలక
లేకుంటే నాయకులకు అలసట
ఉచితాల ఖరీదు కోల్పోయే ప్రభుత్వ భద్రత.

యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం

## అర్చన ఉద్దేశం....!




ఈ సృష్టికి మూలమైన శక్తి ఒకటి
ఉందని మానవులు నమ్ముతారు!
అదే పరమాత్మయని, దైవమని
భక్తితో ఆర్చనలు చేస్తూ ఉంటారు!

భగవంతుని రూపాన్ని మనస్సులో
ధ్యానించడం మానసిక అర్చన
విగ్రహాన్ని పెట్టి ధూప,దీప,నైవేద్యాలతో
పువ్వులతో పూజిస్తే విగ్రహారాధన!

అర్చన ద్వారా మన మనసు
భగవంతునిపై లగ్నం అవుతుంది!
అహంకారం, అలజడి తగ్గి
మనసుకు ప్రశాంతత లభిస్తుంది!

ఆరాధన అనేది మనిషికి తన
జీవిత లక్ష్యాన్ని గుర్తు చేస్తుంది!
ఏకాగ్రచిత్తంతో చేసే పూజ
మనిషిని మంచి వైపు నడిపిస్తుంది!

పుష్పాలు పెట్టడం కాదు అర్చన
పవిత్ర హృదయాన్ని అర్పించడమే!
దీపం వెలిగించడం కాదు పూజ
అజ్ఞానాంధకారాన్ని తొలగించడమే!

అర్చన ఒక బాహ్య కర్మ కారాదు
అది దైవానికి తన హృదయ సమర్పణ!
భగవంతుని తత్వంలో తన ఏకాగ్రతను
లగ్నం చేసే ఒక అద్భుత క్రియ అది!

ఈ.వి.వి.ఎస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



## జానపద కళలుతెలుగు వారి తరగని సంపద :



జనపదములలో పుట్టి జానపదముగాఎదిగిన వైనం.
పదాలను కూర్చి తమకు తామే కూర్చుకున్న వైనం
తెలుగు భాషలో మాత్రమే ఇముద్చుకు న్న వైనం.

నిర్దిష్ట నియమాలు లేనిఅసువు గా పాడు గీతాలు.
అలసిన మనసుకు మానసికోల్లాసం ఇచ్చు గీతాలు.
దేశాన జానపద కళలకు కలవు ఎన్నో ప్రత్యేక త లు

ఒగ్గు కథ కు ప్రపంచంలోప్రసిద్ధి చెందిన కళిక
తోలుబొమ్మలాట తెర వెనుక ఆడించు మెలిక
.
కేతిగాడు జుట్టుపోలిగాడు. హాస్యపు గుళిక.

వీధులలో పురాణగాథలు ప్రదర్శన వీధి భాగవతం.
రంగుబన్నీను, కాలికిగజ్జెలు నడుముకు తప్పెటలు
లయబద్ధంగా సామాజిక ఇతి వృత్తాలు తప్పెటగుళ్లు.

తంబుర మీటుతూ చారిత్రకఘట్టం, వీర, కరుణ
రసాలను అల వోకగా ఒలికించును బుర్రకథ.
ఒకేవ్యక్తి పలు పాత్రల అభినయ ప్రవేశహరికథ.
ఆదిభట్లనారాయణదాసు గారి మానస పుత్రిక.
గ్రామ దేవతల పండుగలలో ప్రత్యేకంకోలాటం.
కాళ్ళగజ్జెలు చేతిలో చెక్కలుకదిపి వేసేది చెక్క భజన.

వివాహాలు, సమ్మక్క సారక్క జాతర లో తుడుము, సన్నాయి,బాకా, డప్పు సాగేది గిరిజన నృత్యం ధింసా.
ఆంధ్రుల మొదటి గిరిజన నృత్యం కురవంజి.

పురాణ గాథలు, పుణ్య క్షేత్రాల్లో వేసే లయబద్ధ అడుగులు.
కాలు కదపని మనసుండదేమో మరి..
కనుమరుగవుతున్న మన వారసత్వపు కళల కు పునర్జీవనంపోసినపుడే అదితెలుగువారి సంపద.

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం. కవి
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డీ.
వి. కోట. చిత్తూరు జిల్లా.
9000169823.



## ప్రకృతి ని విధ్వంసం చేయకుంటే...

భానుడి భగభగలుతో
పుడమి అగ్ని గోళంలా మారి
లావా వలె నిప్పురవ్వలను విరజిమ్ముతుంది

ప్రజలు పొట్ట చేతబట్టుకొని
నాలుగు పచ్చడి మెతుకులు కోసం మండుటెండల్లో
ఉడికిపోతూ ఉక్కిరిబిక్కిరిఅవుతున్నారు

రక్తాన్ని స్వేదం గా మార్చి
రంగురాళ్ల కోసం రంగవల్లురులో
రంగులు మార్చుకుంటూ రంగులు దిద్దుతున్నారు

ఉక్కపోతతో ఉక్కు లాంటి మనిషి
వృక్షం క్రింద సేదదీరగా , తామ్ర పత్రాలు
చిటపటలాడుతూ చిర్రుబుర్రులాడుతున్నాయి

మండే ఎండకు తాలలేక గొడ్డుగోడులు
నీడను చేరగా, మూగజీవాలకు తమ చెమట బిందువులే దాహార్తిగా మారిన దప్పిక తీరదాయే

మానవుడు పగబట్టి పంతానికి పోయి
ప్రకృతి ని విద్వంసం చేస్తుంటే ప్రకృతి చేష్టలుడిగి
చేవ చచ్చి మిన్నకుండి చూస్తుంది...

భూగోళం బద్దలుకాక మునుపే
భూతాపం వేడక్కక మునుపే
భూమిని భద్రపరచుకోవాలి కదా...

అందుకే అందుకే ఓ మానవుడా ....
ప్రకృతి ని విధ్వంసం చేయకుంటే....
పంచభక్ష్య పరమాన్నం నైవేద్యంగా సమర్పిస్తుంది కదా...

రచన :- వేనాప
కోదాడ 98484 32533



## సైబర్ వార్



కంటికి కనిపించని రణరంగం సైబర్ వార్.
కత్తులు, బాణాలు లేని పోరాటం సైబర్ వార్.
అంతర్జాలపు అలలపై సాగే మాయాజాలం.
అంకెలు, అక్షరాలే ఆయుధాలుగా మారిన వింత లోకం.

?కీబోర్డు నొక్కితే చాలు వెలువడుతాయి తూటాలు.
డేటాను దొంగిలించే డిజిటల్ కుతంత్రాలు.
సరిహద్దులు దాటక్కర్లేదు దాడి చేయడానికి.
సైన్యం అవసరం లేదు సర్వనాశనం చేయడానికి.

?విద్యుత్ వ్యవస్థలు విలవిలలాడుతాయి క్షణంకాలంలో.
బ్యాంకింగ్ రంగం బందీ అవుతుంది ఇంటర్నెట్ లో.
దేశ రహస్యాలు చేజారుతాయి మౌనంగా.
ప్రజా జీవనం అతలాకుతలం అదృశ్యంగా.

?గూఢచర్యం నేడు గదులకే పరిమితం.
వైరస్ దాడితో వ్యవస్థలన్నీ అయోమయం.
సాంకేతికతే వరంగా మారి, నేడు అదే శాపంగా మారుతోంది.
మానవ మేధస్సు విధ్వంసానికి దారితీస్తోంది.

?ఈ అదృశ్య సమరంలో అప్రమత్తతే దివ్యాస్త్రం.
సైబర్ ప్రపంచంలో ఇదే రక్షణ కవచం కావాలి.
ఈ నిశ్శబ్ద యుద్ధం వీడి శాంతిని కోరుకుందాం.
రేపటి వైపు అడుగులేసి సురక్షితంగా సాగుదాం.

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా



## గడుసరి అత్త సొగసరి కోడలు (ద్విపాద కవితలు)



1. అత్త ఒకింటి కోడలే! మరి గొడవలెందుకు వస్తాయో!

ఎదిగే కొద్ది మగువ బుద్ధి మందగించును గదా!!

2. అత్త ఒకింటి కోడలే! మరి గొడవలెందుకు వస్తాయో!

అత్తది పేగు పాశము, కోడలిది పెండ్లి బంధము!!

3. అత్త ఒకింటి కోడలే! మరి గొడవలెందుకు వస్తాయో!

నాటి సంప్రదాయము, నేటి విప్లవము మధ్యన రణము!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి,
చెన్నై




# క్రైమ్ థ్రిల్లర్ కథ...పరమపదసోపానం


అర్జున్ అంబటి, జెనిఫర్ ఇమాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు నాగ శివ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన ఈ యాక్షన్ రివెంజ్ డ్రామా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఏ మేరకు ఆకట్టుకుందో విశ్లేషణలోకి వెళ్లి తెలుసుకుందాం. హెల్త్ కమిషనర్ సత్యప్రకాష్ (కోటేశ్వరరావు) దారుణ హత్యతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. ఈ హైప్రొ÷ల్ కేసును ఛేదించే బాధ్యతను అశ్వద్ధామ (అజయ్ రత్నం) స్వీకరిస్తాడు. అయితే ఈ కేసులో ప్రధాన సాక్షిగా అర్జున్ (అర్జున్ అంబటి) అనే గేమింగ్ డిజైనర్‌ను గుర్తిస్తారు. అయితే, అర్జున్ ఓ మానసిక సమస్యతో బాధపడుతుంటాడు. తనను ఎవరో చంపాలని ప్రయత్నిస్తున్నారనే భయంలో ఉన్న అర్జున్‌కు రక్షణగా క్రైమ్ బ్రాంచ్ సీఐ నేహా (జెనిఫర్ ఇమాన్యుయేల్) బృందాన్ని నియమిస్తారు. మరోవైపు వరుసగా ప్రభుత్వ అధికారులు హత్యకు గురవుతుంటారు. ఈ హత్యల వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? హెల్త్ మినిస్టర్ పురుషోత్తం రెడ్డి (పిల్లా ప్రసాద్) పాత్ర ఏమిటి? అసలు 'పాలకడలి' అనే గ్రామానికి, ఈ కథకు ఉన్న సంబంధం ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. దర్శకుడు నాగ శివ తన తొలి ప్రయత్నంలోనే ఒక బలమైన సామాజికాంశాన్ని కమర్షియల్ హంగులతో




జోడించి తెరకెక్కించడంలో విజయం సాధించారు. మొదటి భాగం వరుస హత్యలు, సస్పెన్స్ అంశాలతో పాటు మెహబూబ్ బాషా కామెడీతో సరదాగా సాగిపోతుంది. ఇక ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండాఫ్ పై ఆసక్తిని పెంచుతుంది. రెండవ సగం కథ వేగం పుంజుకుంటుంది. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ మరియు క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. కేవలం 1 గంటా 47 నిమిషాల నిడివి ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. అర్జున్ అంబటి కథకు సరిగ్గా సరిపోయాడు. జెనిఫర్ ఇమాన్యుయేల్ పోలీస్ ఆఫీసర్‌గా ఒక పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించింది. అజయ్ రత్నం చాలా కాలం తర్వాత ఒక బలమైన పాత్రలో కనిపించగా, విలన్ పాత్రలో పిల్లా ప్రసాద్ తన అనుభవాన్ని ప్రదర్శించారు. మెహబూబ్ బాషా కామెడీ రిలీఫ్ ఇచ్చింది.

# మరోమారు వాయిదా దిశగా పెద్ది

### జూన్ 4 నుంచి 24కు మారినట్లు వార్తలు




మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయిందని, ఒక పాట మినహా మిగతా భాగం ముగిసినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఆ చివరి పాట చిత్రీకరణ కొనసాగుతుండగా, విడుదల తేదీపై కూడా స్పష్టత వస్తోంది. ముందుగా జూన్‌లో సినిమా విడుదల అవుతుందని ప్రకటించిన మేకర్స్, ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు. తాజా సమాచారం ప్రకారం, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు ఉండటంతో జూన్ 4న సినిమా విడుదల కష్టమని తెలుస్తోంది. దీంతో జూన్ 25ను విడుదల తేదీగా నిర్ణయించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూన్ 24 రాత్రి నుంచే ప్రీమియర్ ప్రదర్శనలు కూడా ఉండే అవకాశముంది. ఈ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. అభిమానులు మాత్రం ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో భావోద్వేగాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనదైన శైలిలో కథను తెరకెక్కిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారుతోంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'పహిల్వాన్ గ్లింప్స్'కు తోడు ఏఆర్ రెహమాన్ అందించిన 'చికిరి చికిరి', 'రేయ్ రేయ్ రా' వంటి పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. తాజాగా ఈ చిత్రంలో ఉండబోయే హై-వోల్టేజ్ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ గ్లామర్ బ్యూటీ శృతి హాసన్‌న్ని ÷నైల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

# దిల్ రాజ్ నిర్మాతగా సల్మాన్ మూవీ

### పూజా కార్యక్రమాలతో ప్రారంభం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విడుదలైన ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. షూటింగ్ ప్రారంభంపై స్పందించిన సల్మాన్ ఖాన్, ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌ను వచ్చే ఏడాది ఈద్ పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ నిరాశ చెందవద్దు. మీ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుంది అని అభిమానులకు హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఈద్ సందర్భంగా ఆయన సినిమాలు విడుదలై భారీ విజయాలు సాధించడం తెలిసిందే. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగు చిత్రసీమలో విజయవంతమైన సినిమాలతో గుర్తింపు పొందిన వంశీ పైడిపల్లి ఈ సినిమాతో హిందీ చిత్రసీమలో అడుగుపెడుతున్నారు. సల్మాన్ ఖాన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో కథ సిద్ధం చేసినట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో, ప్రేక్షకులను ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలతో సినిమా రూపొందనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరో, టాలీవుడ్ హిట్ దర్శకుడు కలయికలో వస్తున్న ఈ చిత్రం అభిమానుల్లో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. ఈద్ విడుదల లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ సినిమా, సల్మాన్ ఖాన్ కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. కాగా, గత కొన్నాళ్ళుగా సల్మాన్ ఖాన్ హిట్స్ అందించలేక నిరాశలో ఉన్నారు. టాలీవుడ్



డైరెక్టర్‌తో చేస్తున్న సినిమాతో అయిన మంచి హిట్ అందుకుంటాడా అనేది చూడాలి.

# లీగల్ వివాదాల్లో దృశ్యం-3





### ఆలస్యం కానున్న విడుదల

మలయాళ వెండితెరపై సంచలనం సృష్టించిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సిరీస్ సంచలనాలు సృష్టించింది. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడవ భాగం 'దృశ్యం 3' కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చట్టపరమైన చిక్కుల్లో పడటం ఇప్పుడు కేరళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాను నిర్మిస్తున్న ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ గతంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్‌తో కుదుర్చుకున్న డిజిటల్ డీల్‌ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెజాన్ ప్రైమ్ సంస్థ ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు, డిజిటల్ సంస్థకు అనుకూలంగా కీలక తీర్పునిచ్చింది. మే 15వ తేదీ వరకు 'దృశ్యం 3' సినిమాకు సంబంధించి ఎలాంటి కొత్త డీల్స్ క్షి లేదా ఇతర డిజిటల్ హక్కులు కుదుర్చుకోకూడదని నిర్మాతలకు స్టే ఆర్డర్ జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర యూనిట్ డైలమాలో పడింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 21న విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సమస్య త్వరగా కొలిక్కి రాకపోతే మే 21న సినిమా ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు మోహన్ లాల్ అభిమానులు మాత్రం ఈ వివాదం త్వరగా పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు.

# సితార పిక్చర్స్‌లో నితిన్

యంగ్ హీరో నితిన్ వరుస ఫ్లాపులతో బాగా వెనుకబడిపోయాడు. బీష్మ తర్వాత సరైన హిట్ లేక సతమతమవుతున్నాడు. దాంతో లాంగ్ గ్యాప్ తీసుకున్న నితిన్ మరొక సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా సోము, నర్రి అనే ఇద్దరు డెబ్యూ డైరెక్టర్లు టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ కొత్త చిత్రం మే 4వ తేదీన లాంఛనంగా ప్రారంభించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా మే 6వ తేదీ నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ప్రీ ప్లాన్ షెడ్యూల్ తో కేవలం 55 రోజుల్లోనే ఈ సినిమా పూర్తి షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని మేకర్స్ టా÷-గ్గ÷ట్‌గా పెట్టుకున్నారు. అంటే దాదాపు రెండు నెలల లోపే షూటింగ్ పార్ట్ అంతా పూర్తయిపోతుంది. నితిన్ కెరీర్‌లో ఇది వన్ ఆఫ్ ది ఫాస్టెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పవచ్చు. ఈ చిత్రంలో నితిన్ సరసన కథానాయికగా రితికా నాయక్ నటించబోతున్నట్లు సమాచారం. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో మెప్పించిన రితికాకు ఇది నితిన్‌తో ఫస్ట్ మూవీ. ఇక ఈ చిత్రానికి 'విరాటపర్వం' ఫేమ్ సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించబోతున్నారు. మరో ఎన్నాళ్ళుగానో హిట్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా నితిన్ కు డెబ్యూ డైరెక్టర్స్ హిట్ ఇస్తారో లేదో చూడాలి.




# యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్న దీపిక

షారుక్‌ఖాన్, సిద్దార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మూవీ 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా జరుగుతోన్న షూటింగ్ షెడ్యూల్‌లో ఆమెపై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రెండోసారి తల్లి కానున్నట్లు దీపిక ఇటీవల ప్రకటించారు. దీంతో ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను తగ్గిస్తారని అంతా అనుకున్నారు. దానికి భిన్నంగా ఏప్రిల్ 21, 22 తేదీల్లో దీపిక భారీ యాక్షన్ సీన్స్ చేశారట. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఈ పోరాట సన్నివేశాలు రూపొందించినట్లు సమాచారం. త్వరలోనే 8 మందితో కూడిన ్గ÷ట్ సన్నివేశాన్ని కూడా సిద్దార్థ్ ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇసుకలో ఈ ్గ÷ట్ తీయనున్నారట. షారుక్, దీపిక ఇద్దరూ కలిసి ఈ ్గ÷ట్ చేయనున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మరోవైపు ఈ సినిమా విడుదలను డిసెంబర్ 24కే ఖరారు చేస్తూ టీమ్ తాజాగా కొత్త వీడియోను పంచుకుంది. దీంతో అనుకున్న సమయానికి సినిమా వస్తుందా? రాదా? అనే వార్తలకు చెక్ పడింది. క్రిస్మస్‌కు కింగ్ సందడి షురూ అంటూ అభిమానులు ఆ వీడియోను పంచుకుంటున్నారు.



# చట్టం స్పోర్ట్స్

# 2028 ఒలింపిక్స్‌లో అధికారికంగా క్రికెట్



ప్రపంచంలో రెండో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్ వేదికపై కనిపించి దశాబ్దాలు దాటిపోయింది. చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. సరిగా 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడల్లో మళ్లీ మెరవబోతోంది. 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ 2028 నిర్వాహకులు క్రికెట్ పోటీల కోసం దక్షిణ కాలిఫోర్నియాలోని పామోనాలో ఉన్న ఫెయిర్ గ్రౌండ్స్‌ను వేదికగా ఎంపిక చేశారు. ఈ చారిత్రక మైదానంలో బుధవారం నాడు స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ స్టేడియం సుమారు పదివేల కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యంతో నిర్మించబోతున్నారు. అంతర్జాతీయ ప్రామాణాలతో కూడిన ఈ ప్రీమియర్ క్రికెట్ స్టేడియం పురుషుల, మహిళల పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నిర్మాణ పనుల ప్రారంభాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైలురాయిగా అభివర్ణించింది. ఒలింపిక్ చరిత్రలో తొలిసారిగా ఒక క్రీడ మ్యాచ్ సమయాలను భారతీయ ప్రామాణిక సమయానికి అనుగుణంగా రూపొందించడం విశేషం. భారత ఉపఖండంలోని వంద కోట్లకు పైగా ఉన్న క్రికెట్ అభిమానులను ఆకర్షించేందుకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రారంభమవుతాయి. ఇది భారత కాలమాన ప్రకారం వరుసగా రాత్రి 9.30 గంటలకు, ఉదయం 7 గంటలకు అవుతుంది. ఈ సమయాలు భారత టీవీ ప్రేక్షకులకు, డిజిటల్ వీక్షకులకు అత్యంత అనుకూలమైనవి. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతక పోరు ముగిసిన తర్వాతే స్వర్ణ పతక పోరు జరుగుతుంది. కానీ క్రికెట్ విషయంలో ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, స్వర్ణ పతక మ్యాచ్‌ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించాలని నిర్ణయించారు. ఇది భారత్ ప్రైమ్‌కు సరిగా సరిపోతుంది. భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుందని నమ్మకంతోనే వీక్షకుల సంఖ్యను పెంచుకోవడానికి నిర్వాహకులు ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. గాా28 ఒలింపిక్స్‌లో క్రికెట్ అత్యంత వేగవంతమైన టీ 20 ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. పురుషుల, మహిళల విభాగాల్లో చెరో ఆరు జట్లు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటాయి క్రికెట్ ఒలింపిక్స్‌లో చేర్చడం ద్వారా కొత్త దేశాలకు ఈ క్రీడను విస్తరించవచ్చని ఐసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో టీ20 ఫార్మాట్ విజయవంతమైంది. ఐసీసీ ఛైర్మన్ జైషా ఈ పరిణామాలపై సంతోషం వ్యక్తం చేశారు. వేదికల ప్రకటన అనేది ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనానికి పడిన తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఐఓసీతో కలిసి క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒలింపిక్ ఉద్యమంలో భాగం కావడం వల్ల క్రికెట్‌కు వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి మరింత నిధులు , మద్దతు లభిస్తుందని ఐసీసీ పేర్కొంది. అమెరికా క్రీడా అభిమానులు హోమ్ రన్‌లు, లాంగ్ బాల్స్‌ను ఇష్టపడతారని, క్రికెట్‌లో ఇవి పుష్కలంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒలింపిక్స్ ద్వారా అమెరికన్లకు క్రికెట్ పట్ల ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. గాా28లో క్రికెట్‌తోపాటు బేస్ బాల్/ సాఫ్ట్ బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ వంటి క్రీడలు కూడా కొత్తగా చేరాయి. భారత్ , ఉపఖండం కోసం మీడియా హక్కుల విక్రయం విషయంలో నిర్వాహకులు మూడు రకాల ప్యాకేజీలు సిద్ధం చేశారు. మల్టీప్లాట్‌ఫామ్, టీవీ ఓన్లీ, డిజిటల్ ఓన్లీ. దీని ద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

## లక్నో వరుస ఓటములు



లక్నో వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జియాంట్స్ కీలక మ్యాచ్‌లో తలపడ్డాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యాక 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (22) రాణించగా.. వైభవ్ సూర్యవంశీ (8), ధ్రువ్ జురేల్ (0), కెప్టెన్ రియన్ పరాగ్ (20), షిమ్రాన్ హెట్‌మెయిర్ (22) తక్కువ పరుగులు చేయగా.. రవీంద్ర జడేజా (43), ఫెరిరా (20) మోస్తరు స్కోర్ నమోదు వద్ద ఔటయ్యారు. లక్నో బౌలర్లు అద్భుతం వేసి బ్యాటర్లు అందరినీ వెనక్కి పంపించేశారు. లక్నో బౌలర్లు బ్రిజేష్ శర్మ, జోఫ్రా ఆర్చర్, బర్గర్ వరుసగా రెండేసి వికెట్లు తీసి అదరగొట్టారు. స్వల్ప లక్ష్య ఛేదనకు బరిలో దిగిన లక్నో సూపర్‌జియాంట్స్ భారీగా విఫలమైంది. 18 ఓవర్లు పూర్తి చేసుకుని 119 పరుగులు మాత్రమే చేసింది. మిచెల్ మార్ష్ మినహా దాదాపు ఏ ఒక్క బ్యాటర్ సమీక్ష చేయనున్నారు. ఆయుశ్ బదౌనీ, రిషబ్ పంత్, మర్‌క్రమ్ ఇలా ముగ్గురికి ముగ్గురు ఒక్క పరుగు కూడా చేయకుండా డకౌట్‌గా వెళ్లిపోయారు. 41 బంతుల్లో మార్ష్ 55 పరుగులు చేసి అర్ధ సెంచరీ నమోదు చేశాడు. అనంతరం నికోలస్ పూరన్ (22), హిమ్మత్ సింగ్ (15) కొంత పోరాడినా విజయానికి కావాల్సిన పరుగులు సాధించలేకపోయారు. ముకుల్ రాయ్, హిమ్మత్ సింగ్ దూకుడుగా ఆడారు. ఛేదనకు దిగిన లక్నో బ్యాటర్లను లక్నో సూపర్ జియాంట్స్ అద్భుతంగా బౌలింగ్ వేసి అన్నీ వికెట్లు తీశారు. జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లు, నంద్రే బర్గర్ రెండు వికెట్లు టపాటపా పడగొట్టారు. ఈ సీజన్‌లో వరుసగా రెండు ఓటములు చెందిన రాజస్థాన్ రాయల్స్ లక్నో గడ్డపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. విజయంతో రాజస్థాన్ రాయల్స్ తమ ర్యాంకును మెరుగుపర్చుకోగా.. ఐదో ఓటమిని ఖాతాలో వేసుకున్నారు. సీజన్‌లో మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడిన లక్నో సూపర్ జియాంట్స్ 2 విజయాలు, ఐదు పరాజయాలతో కొనసాగుతోంది. ఇది వరకు వచ్చు వరుసగా నాలుగు పరాజయం పొందడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నా. ఏడు మ్యాచ్‌లు ఆడిన రాజస్థాన్ రాయల్స్ 5 విజయాలు, రెండు పరాజయాలు సాధించింది. వరుసగా రెండు ఓటముల అనంతరం రాజస్థాన్ గొప్పగా పుంజుకుని ఆడింది.

## మూడో టీ20లోనూ భారత మహిళల జట్టు వరుసగా ఓటమి



సౌతాఫ్రికా పర్యటనలో భారత మహిళల జట్టు వరుసగా మూడో టీ20లోనూ ఓటమిపాలైంది. జొహెన్నస్?బర్గ్ వేదికగా ఆతిథ్య సౌతాఫ్రికాతో తాజాగా జరిగిన మూడో మ్యాచ్?లో భారత్ 9 వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 193 పరుగుల భారీ టార్గెట్?ను సఫారీ జట్టు కేవలం 1 వికెటే కోల్పోయి 16.3 ఓవర్లలోనే ఛేధించడం విశేషం. కెప్టెన్ లారా వోల్వార్ట్ (115 పరుగులు, 53 బంతుల్లో) సూపర్ సెంచరీతో అదరగొట్టగా, సున్ లస్ (64లి పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించింది. దీంతో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. భారత్ బౌలర్లలో శ్రేయాంక పాటిల్ మాత్రమే వికెట్ తీయగలిగింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64 పరుగులు), కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ (66 పరుగులు) హాఫ్ సెంచరీలతో మెరిశారు. స్మృతి మంధాన (37 పరుగులు) ఫర్వాలేదనిపించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మ్లాబా 2, నదైన్ డి క్లర్క్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, తాజా విజయంతో ఐదు మ్యాచ్?ల టీ20 సిరీస్?ను సౌతాఫ్రికా 3-0తో దక్కించుకుంది. తొలి రెండు మ్యాచ్?ల్లోనూ టీమ్‌ఇండియా ఓడింది. ఇరుజట్ల మధ్య నామమాత్రపు నాలుగో టీ20 మ్యాచ్ ఏప్రిల్ 25న జరగాల్సి ఉంది. వాస్తవానికి ఈ పర్యటనలో భారత్ గత రెండు మ్యాచ్?ల్లో కంటే ఈసారి బ్యాటింగ్?లో మెరుగ్గా రాణించింది. సిరీస్? దక్కించుకోవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్?లో తొలుత బ్యాటింగ్?కు దిగింది. ఓపెనర్లు మంధాన- షఫాలీ మంచి ఆరంభం ఇచ్చారు. వన్?డౌన్?లో జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమైనా, కెప్టెన్ హర్మన్ చెలరేగింది. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ జోరును ప్రదర్శించింది. 173.68 స్ట్రైక్ రేట్?తో 66 రన్స్ చేసింది. చివర్లో రిచా ఘోష్ (18లి) కూడా బాగా ఆడింది. దీంతో భారత్ భారీ స్కోర్ చేసింది. ఇంతటీ స్కోర్ చేయడంతో టీమ్‌ఇండియా గెలుస్తుందని అనుకున్నారంతా. కానీ సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభం అయ్యాక అంచనాలు తారుమారయ్యాయి. ఓపెనర్లు వోల్వార్ట్, లుస్ రెచ్చిపోయారు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ఈ క్రమంలోనే వోల్వార్ట్ సెంచరీ, లుస్ హాఫ్ సెంచరీలు సాధించారు. వీళ్లు విధ్వంసం సృష్టించడంతో చాలా ముందే భారత్ ఓటమి ఖరారైంది. 15.3 ఓవర్ వద్ద ఎట్టకేలకు భారత్ తొలి వికెట్ తీసింది. సెంచరీ సాధించిన వోల్వార్ట్?ను శ్రేయంక ఔట్ చేసింది. అప్పటికి సౌతాఫ్రికా స్కోర్ 183. ఈ ఏడాది జూన్?లో ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 వరల్డ్?కప్ జరగనుంది. గతేడాది వన్డే ప్రపంచకప్ నెగ్గిన ఉత్సాహంలో భారత్? ఈ టోర్నీలో అడుగుపెట్టనుంది. టైటిల్ ఫేవరెట్?గా దిగనున్న టీమ్‌ఇండియాకు ఆ టోర్నీ ముందు ఇలాంటి సిరీస్? ఆందోళన కలిగిస్తుంది. ఈ పర్యటనలో ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా, మూడింట్లోనూ భారత్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడు 193 పరుగుల భారీ లక్ష్యాన్ని సైతం కాపాడుకోలేదు. కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేదు. దీంతో వరల్డ్?కప్ ముంగిట ఇలా అయితే ఎలా? అంటూ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు!

## మ్యాక్స్‌వెల్ రికార్డ్ బ్రేక్ చేసిన వైభవ్



రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్?లో రికార్డుల మీద రికార్డులను తన ఖాతాలో వేసుకుంటున్నాడు. తాజాగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో మ్యాచ్?లో 8 పరుగులకే పెవిలియన్ చేరినప్పటికీ వైభవ్ తన పేరిట పలు రికార్డులు లిఖించుకున్నాడు. అతడితోపాటు జట్టు స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఓ అరుదైన ఘనత అందుకున్నాడు.టాస్ ఓడి బ్యాటింగ్?కు దిగిన రాజస్థాన్?కు ఘనమైన ఆరంభం దక్కలేదు. జైస్వాల్ వేగంగా ఆడినా, లీగ్?లో తొలిసారి వైభవ్ ఇబ్బంది పడ్డాడు. 11 బంతులు ఎదుర్కొని కేవలం 8 పరుగులే చేశాడు. అతడిని మొహ్సిన్ ఖాన్ పెవిలియన్?కు చేర్చాడు. అయితే 2 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్దే వైభవ్ సూపర్ రికార్డు సాధించాడు. గతేడాది ఐపీఎల్?లో అరంగేట్రం చేసిన ఈ చిచ్చరపిడుగు 500 పరుగుల మైలురాయి అందుకున్నాడు. అతడు కేవలం 237 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో అత్యంత తక్కువ బంతుల్లో ఈ మైల్?స్టోన్ సాధించిన బ్యాటర్?గా అరుదైన ఘతన సాధించాడు. ఈ క్రమంలోనే స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్?వెల్ రికార్డ్?ను వైభవ్ బద్దలుకొట్టాడు. 500 పరుగులు పూర్తి చేసేందుకు మ్యాక్స్?వెల్ 260 బంతులు తీసుకున్నాడు. ఈ మ్యాచ్ ఆడిన నాటికి వైభవ్ వయసు 15ఏళ్ల 26 రోజులు. ఈ నేపథ్యంలో ఐపీఎల్?లో 500 రన్స్? పూర్తి చేసుకున్న అత్యంత పిన్న వయస్కుడిగానూ వైభవ్ రికార్డు కొట్టాడు. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఈ మ్యాచ్?లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఎయిడెన్ మార్?క్రమ్? సహా, మయంక్ యాదవ్, మోహ్సిన్ ఖాన్?ను పెవిలియన్?కు చేర్చాడు. మొత్తం నాలుగు ఓవర్ల కోటాలో ఒక మెయిడెన్ సహా 20 రన్స్ ఇచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే రాజస్థాన్? రాయల్స్ తరపున ఐపీఎల్?లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్?గా నిలిచాడు. ఇదివరకు యుజ్వేంద్ర చాహల్ (66 వికెట్లు) పేరిట ఈ రికార్డు ఉంది. తాజాగా ఆర్చర్ ఆ రికార్డ్?ను అధిగమించాడు.

## ఐపీఎల్ పాయింట్స్ టేబుల్‌లో పంజాబ్ హవా



ఐపీఎల్ మ్యాచ్‌లు క్రికెట్ ఫ్యాన్స్‌కు మస్త్ మజాను అందిస్తున్నాయి. ఫోర్లు, సిక్సర్లతో బ్యాట్స్‌మెన్లు హోరెత్తిస్తుంటే.. అదిరిపోయే బంతులతో బౌలర్లు దుమ్ములేపుతున్నారు. మొదట్లో బ్యాట్స్‌మెన్ పూర్తి ఆధిపత్యం చెలాయించగా.. ఇప్పుడు బౌలర్ల హవా మొదలైంది. బుధవారం లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో బౌలర్ల హవా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. ఆరు వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. అనంతరం లక్నో జట్టు 18 ఓవర్లలో కేవలం 119 పరుగులకే ఔట్ అయింది. ఇప్పటివరకు అన్ని జట్లు ఆరు మ్యాచ్‌లు ఆడేయగా.. కొన్ని జట్లు 7 మ్యాచ్‌లు కూడా ఆడేశాయి. పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో కూడా దూసుకెళ్తోంది. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. 11 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. లక్నోపై విజయంతో రాజస్థాన్ రాయల్స్ రెండోస్థానానికి చేరింది. 7 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి.. 8 పాయింట్లతో మూడోస్థానంలో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 7 మ్యాచ్‌లు ఆడగా.. నాలుగు విజయాలు సాధించింది. 8 పాయింట్లతో నాలుగోస్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ 5 మ్యాచ్‌లు ఆడగా.. మూడింట గెలుపొందింది. ఢిల్లీ ఖాతాలో ఆరు పాయింట్లు ఉండగా.. పాయింట్ల పట్టికలో ఐదోస్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ ఐదు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆరోస్థానంలో ఉంది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లో గెలుపొందిన ముంబై ఇండియన్స్.. ఆ తరువాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. చివరి మ్యాచ్‌లో గెలుపొంది రెండో విజయం ఖాతాలో వేసుకుంది. నాలుగు పాయింట్లో ఏడోస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఈ సీజన్‌లో కూడా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ఆరు మ్యాచ్‌లు ఆడగా.. కేవలం రెండు విజయాలతో 8వ స్థానంలో ఉంది. ఇక లక్నో సూపర్ జెయింట్స్ పర్ఫామెన్స్ మరీ తీసికట్టుగా ఉంది. ఏడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో కింది నుంచి రెండోస్థానంలో ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్ మాత్రం ప్లే ఆఫ్ రేసు నుంచి అన్ని జట్ల కంటే బాగా వెనుకపడిపోయింది. ఏడు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మూడు పాయింట్లతో చివరిస్థానంలో ఉంది. మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కనీసం ఆరు మ్యాచ్‌లు గెలిస్తే ప్లే ఆఫ్ రేసులో ఉంటుంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో అత్యధిక పరుగులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్‌లో ఉన్నాడు. 7 మ్యాచ్‌ల్లో 323 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా ఉన్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (283), శుభ్‌మన్ గిల్ (265) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ 13 వికెట్లతో పర్పుల్ హోల్డర్‌గా ఉన్నాడు. ఆ తరువాతి స్థానాల్లో అన్షుల్ కాంబోజ్ (13), ఈషాన్ మలింగ (12) ఉన్నారు.

..............

## ఈ అవార్డు గుజరాత్ మంత్రికి అంకితమిస్తున్నా- రవీంద్ర డేజా



లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన లో స్కోరింగ్ మ్యాచ్?లో రాజస్థాన్ రాయల్స్ భళా అనిపించింది. బ్యాటుతో తడబడ్డా బంతితో రాణించిన రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా ఆర్?రౌండ్ ప్రదర్శనతో రాణించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డును అతడు 'గుజరాత్ విద్యాశాఖ మంత్రి'కి అంకింతం ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం అవార్డ్? ప్రజెంటేషన్?లో జడేజా కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టు విజయంలో కీలకంగా మారినందుకు సంతోషంగా ఉందని చెప్పాడు. 'మ్యాచ్ గెలిపించినందుకు హ్యాపీగా ఉంది. అయితే అవార్డును నేను గుజరాత్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి డెడికేట్ చేస్తున్నా. ఎందుకంటే నేను ఇవాళ అద్భుతమైన ప్రదర్శన చేస్తానని ఆమె నిన్ననే నాతో చెప్పింది. ఆమెకు థాంక్స్?' అని జడ్డూ పేర్కొన్నాడు. కాగా, ఆ మంత్రి ఎవరో కాదు జడేజా సతీమణి రివాబా జడేజానే!సుదీర్ఘ ఐపీఎల్? కెరీర్?లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం జడేజాకు ఇది 17వసారి. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ తరపున కాకుండా ఇతర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ అవార్డు దక్కించుకోవడం మాత్రం ఇదే తొలిసారి. సీఎస్కేకు కాకుండా జడేజా ఇతర ఆయా జట్ల (రాజస్థాన్, కొచ్చి టస్కర్స్ కేరళ, గుజరాత్ లయన్స్)కు 75 మ్యాచ్?ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇక చెన్నై తరపున 186 మ్యాచ్?ల్లో బరిలోకి దిగగా అందులో 16 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. లఖ్?నవూతో మ్యాచ్?లో పిచ్ బ్యాటింగ్?కు? అంతగా సహకరించలేదు. టాపార్డర్ విఫలమైన వేళ జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో నిలబడి స్కోర్ బోర్డును నడిపించాడు. 29 బంతులు ఆడిన జడ్డూ 43 పరుగులు చేసి నాటౌట్?గా నిలిచాడు. ఇందులో 2 ఫోర్లు, 1 సిక్స్? ఉన్నాయి. అనంతరం బౌలింగ్?లోనూ రాణించాడు. నాలుగు ఓవర్లో కోటాలో 29 పరుగులిచ్చి 1 వికెట్ దక్కించుకున్నాడు. అదీనూ నికోలస్ పూరన్ వికెట్ కావడం విశేషం. ఇక మ్యాచ్ విషయానికొస్తే, రాజస్థాన్ నిర్దేశించిన 160 లక్ష్య ఛేదనలో లఖ్?నవూ తేలిపోయింది. మిచెల్ మార్ష్ (57) మినహా మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. 18 ఓవర్లలో లఖ్?నవూ 119 పరుగులకు కుప్పకూలిపోయింది. దీంతో రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, నాంద్రె బర్గర్, బ్రిజేష్ శర్మ చెరో 2, రవీంద్ర జడేజా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జడేజా భార్య రివాబా జడేజా నార్త్ జామ్?నగర్? స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు. అయితే గతేడాది గుజరాత్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమెను మంత్రి పదవి వరించింది. ప్రస్తుతం ఆమె ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కేబినెట్?లో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.లఖ్?నవూ స్పీడ్ గన్ మయంక్ యాదవ్ ఈ మ్యాచ్?తో ఐపీఎల్?లో ఎంట్రీ ఇచ్చాడు. అయితే అతడికి ఆశించిన రేంజ్?లో కమ్?బ్యాక్ రాలేదు. 140ం వేగంతో బంతులేసినా ధారాళంగా పరుగులు ఇచ్చాడు. నాలుగు ఓవర్లో కోటాలో 14 ఎకనామీతో 56 రన్స్? ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999